క్లుప్తంగా

మహాశివరాత్రి ఏర్పాట్లపై రేపు సమావేశం

సామర్లకోట: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తుల నుంచి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరించడానికి గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆలయ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసినట్టు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో ట్రస్టు బోర్డు సభ్యులు, భక్త సంఘం, దీపారాధన సంఘం సభ్యులు, రైతులు పాల్గొని సలహాలు ఇవ్వాలన్నారు.

క్షతగాత్రులకు దొరబాబు పరామర్శ


మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన దొరబాబు

సామర్లకోట: పెద్దాపురం మండలం గుడివాడ, కాండ్రకోట రోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పరామర్శించారు. పనసపాడు గ్రామ పరిధిలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని మంగళవారం పరామర్శించి క్షతగాత్రులకు ధైర్యం చెప్పారు. ఈ మేరకు డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించే విధంగా ఏర్పాటు చేశారు.

వ్యక్తిపై కేసు

కొత్తపల్లి: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 15వ తేదీన వాకతిప్పకు చెందిన పెదపాటి బాబులు పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో నడిచి వెళుతుండగా గోర్స జంక్షన్ వద్ద ఉన్న సత్తెమ్మతల్లి గుడి సమీపంలో మోటార్ సైకిల్‌పై ఒక వ్యక్తి వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో బాబులకు గాయాలయ్యాయి. దీనిపై ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


పూర్వ విద్యార్థుల కలయిక

కొత్తపల్లి: మండలంలోని మూలపేట జెడ్పీ పాఠశాలలో 1991–92 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పొన్నాడ శివారు తీర ప్రాంతంలో ఆత్మీయంగా కలుసుకున్నారు. రాజకీయ రంగంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ అయిన వారిని విద్యార్థులు సత్కరించారు. ఇకపై ఏటా ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకోవాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ కలయికలో పూర్వ విద్యార్థులు, పొన్నాడ సర్పంచ్ బండి రాణి, వైఎస్సార్ సీపీ నాయకుడు గోగు జగన్నాథం పాల్గొన్నారు.

పాన్‌షాపులో అగ్ని ప్రమాదం


మంటలు అదుపు చేస్తున్న రాక్ సిరామిక్స్ సిబ్బంది

సామర్లకోట: స్థానిక పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని పాన్‌షాపులో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. పెద్దాపురానికి చెందిన వాసు రాక్ సిరామిక్స్ ఎదురుగా పాన్‌షాపుతో కలిపి చిన్న హోటల్ ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాడు. ముక్కనుమ పండగ కావడంతో వ్యాపారితో పాటు కూలీలు కూడా సెలవు తీసుకున్నారు. దాంతో షాపులో ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. గుర్తు తెలియని వ్యక్తులు పాన్‌షాపునకు నిప్పు పెట్టారనే విమర్శలు ఉన్నాయి. షాపునకు అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న రాక్ సిరామిక్స్ సిబ్బంది ఫ్యాక్టరీలోని అగ్నిమాపక వాహనం ద్వారా మంటలు అదుపు చేశారు.

పరీక్ష పే చర్చకు వేట్లపాలెం విద్యార్థి

సామర్లకోట: ఈనెల 24 నుంచి 28 వరకు ఢిల్లీలో ప్రధాని మోదీ నిర్వహించే పరీక్ష పే చర్చ–2023కు వేట్లపాలెం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి తగరంపూడి ఇస్సాకు ఎంపిక అయినట్లు కాకినాడ జిల్లా నాయిబ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు సుందరపల్లి వీవీయస్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కరపలోని మహాత్మా జ్యోతిబా పూలే రాష్ట్ర వెనుకబడిన గురుకుల పాఠశాలలో 10 తరగతి చదువుతున్నాడని తెలిపారు. విద్యార్థి తండ్రి తగరంపూడి సత్యనారాయణ హుస్సేన్‌పురంలోని ఒక ప్రైవేటు ఫ్యాక్టరీలో పని చేస్తాడన్నారు. ఢిల్లీకి ఈనెల 23న బయల్దేరతాడన్నారు. ఇస్సాకు వేట్లపాలెం గ్రామానికి చెందిన నాయకులు, నాయిబ్రాహ్మణ సంఘ నాయకులు అభినందించారు.

క్లాస్‌గా.. దోపిడీ

- సామాన్యుల వినోదానికి తూట్లు
- ఇష్టానుసారంగా సినిమా టికెట్ల విక్రయం
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు

సామర్లకోట: సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు కుటుంబ సమేతంగా వినోదం కోసం సినిమాలకు వెళుతుంటారు. అయితే ఆ వినోదం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారింది. సంక్రాంతి పండగను పురస్కరించుకొని బాలకృష్ణ, చిరంజీవి సినిమాలు విడుదల య్యాయి. బాలకృష్ణ సినిమా జయలక్ష్మి థియేటర్ స్క్రీన్–1లో, చిరంజీవి సినిమా విఘ్నేశ్వరా థియేటర్‌లోను విడుదల అయ్యాయి. ఈ రెండు థియేటర్లలో దిగువ క్లాసుకు 30 శాతం, ఎగువ క్లాసుకు 70 శాతం సీట్లు కేటాయించారు. దిగువ క్లాసు రూ.40, ఎగువ క్లాసు రూ.వంద రేట్లతో రెండు క్లాసులు ఉండేవి. సంక్రాంతి పండగను పురస్కరించుకొని రెండు క్లాసులు కలిపి ఒకే క్లాస్‌గా టికెట్లు విక్రయిస్తూ వినియోగదారులను దోచుకోవడం విశేషం.

సంక్రాంతిని పురస్కరించుకొని నాలుగు రోజుల పాటు చిరంజీవి సినిమా వాల్తేరు వీరయ్యకు రూ.45, బాలకృష్ణ సినిమా వీరసింహారెడ్డికి రూ.40 పెంచి టికెట్లు విక్రయించుకునేలా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే కాకినాడ వంటి సిటీలో లేని విధంగా సామర్లకోట రెండు థియేటర్లలో టికెట్‌ను రూ.200కు విక్రయిస్తున్నారు. కాకినాడ సిటీలో మల్టీప్లెక్స్ వంటి థియేటర్‌లో టికెట్ ధర రూ.175 మాత్రమే ఉంటే.. అంతకు మించి సామర్లకోటలో విక్రయిస్తున్నారు. మరోవైపు ఈ ధరల బాదుడిపై ఫిర్యాదులు అందినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొత్త సినిమాల విడుదల సమయంలో రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ ఉండాలి. అయితే వారెక్కడా కనిపించకపోవడంతో వారికీ ముడుపులు అందాయనే ప్రచారం సాగుతోంది. జయలక్ష్మి థియేటర్ స్క్రీన్–1లో 405, విఘ్నేశ్వర థియేటర్‌లో 355 సీట్ల సామర్థ్యంతో ఉన్నాయి. థియేటర్ల బయట డిమాండ్ బట్టి బ్లాక్‌లో రూ.300కు టికెట్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


సామర్లకోటలో వాల్తేరు వీరయ్య సినిమా కోసం రెండు గంటల ముందుగా థియేటర్ వద్ద వేచి ఉన్న జనం

ఫిర్యాదులు చేసినా పట్టించుకోరు



కొత్త సినిమా విడుదలైతే చాలు థియేటర్ల యాజమాన్యం ప్రేక్షకులను దోచుకునే పనిలో పడుతోంది. ప్రజలు పండగలో కుటుంబ సమేతంగా సినిమాకు వెళితే జేబులు ఖాళీ అవుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల కంటే అధికంగా టికెట్లు విక్రయిస్తున్నారు.

– నేతల హరిబాబు, కౌన్సిలర్, సామర్లకోట

పండగలో కూడా సిబ్బందిని నియమించాం..



సంక్రాంతి సందర్భంగా కొత్తగా విడుదలైన సినిమాల రేట్లు ఎక్కువగా విక్రయించే అవకాశం ఉండడంతో రెవెన్యూ సిబ్బందిని థియేటర్ల వద్ద ఏర్పాటు చేశాం. కాకినాడలో కంటే అధిక రేట్లకు విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై చర్యలు చేపడతాం.

– ఎస్ఎల్‌వీ కుమారి, తహసీల్దార్, సామర్లకోట

రామాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


రాముల వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గొల్లప్రోలు కొత్తపేట ఏకాం రామ కోవెల వద్ద ఏకాహం ముగింపు సందర్భంగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు రాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులుగా నిర్వహించిన నిరంతర భజన ముగియడంతో మంగళవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను పండుగ రోజుల్లో కొనసాగించడం ఆనందందాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జ్యోతుల భీముడు తదితరులు పాల్గొన్నారు.

కళలంటే ప్రాణం.. నటనంటే ఇష్టం..

- సినీరంగంలో నిలదొక్కుకోవడమే ధ్యేయం
- మాధవపురం వాసి నాగేశ్వరరావు


గాడ్ ఫాదర్ సినిమాలో సైడ్ ఆర్టిస్ట్‌గా నాగేశ్వరరావు


ఉలిక్కిపడ్డ ఉప్పాడ సినిమాలో..


వారెవ్వా జతగాళ్లు సినిమాలో..

పిఠాపురం: ఒక్క చాన్స్.. ఒకే ఒక్క చాన్స్.. అంటు సినిమా రంగంవైపు అడుగులు వేశారు పిఠాపురం మండలం మాధవపురానికి చెందిన దంగేటి నాగేశ్వరరావు. ఇప్పుడిప్పుడే అక్కడ నిలదొక్కుకుంటున్న ఆయన భవిష్యత్తులో మరింత సాధించాలని కృషి చేస్తున్నారు. ప్రేక్షకులు ఆదరిస్తే మరింత మంచి నటుడుగా తన ప్రతిభను నిరూపించుకుంటా నంటున్నాడు నాగేశ్వరరావు. రచయితగా, కేరెక్టర్ ఆర్టిస్టుగా, నటుడుగా, దర్శకుడిగా (నాటక రంగంలో) తన కెరీర్‌ను ప్రారంభించి ప్రస్తుతం నటుడి స్థిరపడ్డారు.

నాగేశ్వరరావు ఎంఏ హిస్టరీ, పాలిటిక్స్, హోటల్ మేనేజ్‌మెంట్ చదువుకున్నారు. చిన్న నాటి నుంచి సినిమాలపై మక్కువతో సినీ రచయిత కులశేఖర్ వద్ద పని చేసే అవకాశం దక్కించుకుని సినీ రంగంలోకి ప్రవేశించారు. యముడు చిత్రగుప్తుడు విహార యాత్ర, కురిడిబాబా కురిడి శిష్యులు, నిమ్మకాయ్, పల్లెటూరి కుర్రాళ్లు అనే నాటకాలు రచించి, దర్శకత్వం చేయడంతో పాటు నటుడిగానూ ప్రతిభ నిరూపించుకున్నారు. సినీ నిర్మాత ప్రసాదరెడ్డి వద్ద దర్శకత్వం నేర్చుకున్నారు. స్వీట్ లవ్ అనే చిత్రంలో సెకండ్ హీరోగా అవకాశం రావడంతో సినీ నటుడిగా మారారు. దుర్మార్గుడు, వినరా సోదర వీరకుమారా, రామ్ సిటెనక్ కలియుగ భహరా (ఒడియా), ఉలిక్కి పడ్డ ఉప్పాడ, ఉప్పెన, కన్యాసుంకం, ఆర్ఎక్స్100, దత్తాత్రేయ లీలామృతం, ఓతండ్రి తీర్పు, కాశ్మోరా, అత్తమ్మ, జతగాళ్లు, 30 రోజుల్లో ప్రేమించడం ఎలా తదితర సినిమాలలో నటించారు. మౌనపోరాటం, నాలుగు స్తంభాలాట, మనసు మమత వంటి మెగా టీవీ సీరియల్స్‌లో నటించారు.

నటుడిగా ఎదగాలన్నదే ధ్యేయం

కళలంటే ప్రాణం. రచయితగా నటుడిగా అవకాశం వచ్చిన ప్రతీ దానిని వినియోగించుకుని ముందుకు వెళుతున్నాను. ఒక సినిమా కథ రాశాను. రచయిత కార్డు కోసం ప్రయత్నిస్తున్నాను. ఇప్పటి వరకు 19 సినిమాలు, 11 టీవీ సీరియల్స్, 9 నాటకాల్లో నటించాను. సినీ రంగంలో పైకి రావాలని నిరంతరం కృషి చేస్తూనే ఉన్నాను.

– దంగేటి నాగేశ్వరరావు, వర్ధమాన సినీ నటుడు, మాధవపురం

భిన్నత్వంలో ఏకత్వం

- 20 నుంచి మూడు రోజులు గంధోత్సవం
- మత సామరస్యానికి ప్రతీకగా పెద్దాపురంలో ఉరుస్ ఉత్సవం


ఉరుస్ గంధోత్సవానికి సిద్ధమవుతున్న తొమ్మిది మూరల సాహెబ్ సమాధి ఇదే

పెద్దాపురం: సుమారు 354 సంవత్సరాల చరిత్ర కల్గిన పట్టణ శివారులోని హజరత్ షేక్ మదీనా పాచ్చా ఔలియా(తొమ్మిది మూరల సాహెబ్) మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉరుస్ గంధోత్సవాన్ని ఈనెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు దర్గా కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా 20న దర్గా వద్దకు మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు విచ్చేసి బాబా ఆశీస్సులు పొందుతారు. ముస్లింలు, అంజుమన్ వ్యవస్థాపకుడు దివంగత ఎంఏ సత్తార్ ఇంటి వద్ద నుంచి 20వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు గంధం ఊరేగింపు మేళతాళాలతో బయల్దేరి దర్గా చేరుకుంటుంది. సాయంత్రం ఏడుగంటలకు హైదరాబాద్ వారిచే తయారు చేయబడిన పచ్చటి వస్త్రాన్ని బాబా వారికి అలంకరించి ఖురాన్ పఠనంతో గంధాన్ని బాబా సమాధికి పూస్తారు. బాబాకు పూసిన గంధాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరిస్తారు.

పార్టీ రహితంగా దాతల సహకారంతో..

ఉరుస్ ఉత్సవాన్ని ఏటా పార్టీ రహితంగా ప్రజల సహకారంతో వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. దర్గాకు సంబంధించి ఎటువంటి ఆస్తులు లేకపోవడంతో దాతల సహకారంతో పై కప్పు ఏర్పాటు, దర్గా వద్ద మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. దాతలు, ప్రజల సహకారంతో ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగ తాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల బాబు తదితరులు ప్రారంభిస్తారు. 22వ తేదీ వరకు గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించి మూడవ రోజు భారీ అన్నదానాన్ని ఏర్పాటు చేస్తారు. దర్గా సభ్యులు ఎండీ లాయక్ అలీ, బాబూలాల్, ఆషిక్ అలీ, రఫీ, సబ్బీర్, జలీల్, బాజి, రిజ్వాల్, ఇర్షాద్ అలీ, హఫీజ్, జాకీర్‌ల ఆధ్వర్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు మూడు రోజుల పాటు భిన్నత్వంలో ఏకత్వం మాదిరిగా అన్ని మతాల వారితో కలిపి వివిధ సేవా కార్యక్రమాలు, పేదలకు వస్త్రదానం నిర్వహించి ఉరుస్ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 20వ తేదీ రాత్రి 9 గంటలకు రాజమహేంద్రవరం వారిచే మిమిక్రీ ట్రాక్, మ్యూజికల్ ప్రోగ్రాంతో పాటు ఖవ్వాళీ నిర్వహిస్తారు.

నాటకం పల్లెపల్లెకూ చేరాలి

- స్నేహ ఆర్ట్స్ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు గొందేసి రాజా
- ఈ నెల 24 నుంచి చంద్రమాంపల్లిలో రాష్ట్ర స్థాయి నాటక కళాపరిషత్ పోటీలు


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గొందేసి రాజా

పెద్దాపురం: నాటకం పల్లెపల్లెకు చేరాలనే స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తొలిసారి నాటక కళా పరిషత్ పోటీలు నిర్వహించనుందని స్నేహ ఆర్ట్స్ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు గొందేసి రాజా అన్నారు. పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామంలో ఈనెల 24 నుంచి 26 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి నాటక కళా పరిషత్ పోటీల వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. కళ కళ కోసం కాదు, కళ ప్రజల కోసం, ప్రగతి కోసమన్నారు. నాటకం అనేది చాలా శక్తిమంతమైందని, నాటకం సమస్యలకు కారణాలను, వాటి పరిష్కార మార్గాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తుందన్నారు. దీని కోసం నాటకం పల్లెపల్లెకు చేరువకావాలని భావిస్తూ కొన్ని నాటకాలను ప్రదర్శిస్తూ మూడేళ్ల క్రితం పరిషత్‌ను ఏర్పాటు చేయాలని స్నేహ ఆర్ట్స్ భావించిందన్నారు. ఈనెల 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు ఏడు నాటికల ప్రదర్శన ఉంటుందని రాజా తెలిపారు. 24వ తేదీ రాత్రి ఏడు గంటల నాటక కళా పరిషత్ పోటీలకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ అబ్బిరెడ్డి రమణారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తారన్నారు. తొలిరోజున విశాఖ జిల్లా ఉక్కు నగరం వారి 'గుడి ఎనక నాసామి', హైదరాబాద్ వారి 'దా'రుణం', 25వ తేదీన కాకినాడ వారి 'గమ్య స్థానాల వైపు', గుంటూరు వారి 'రెండు నిశబ్దాల మధ్య', మూడో ప్రదర్శనగా చిలకలూరిపేట వారి 'నాన్నా నేనొచ్చేస్తా', 26వ తేదీన హైదరాబాద్ వారిచే 'మనిషి మంచోడే', కాకినాడ వారి 'రాయి' నాటికతో పాటు మూడో ప్రదర్శనగా స్నేహ ఆర్ట్స్ చంద్రమాంపల్లి వారిచే 'ఆ రోజు కోసం' నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో కొత్తెం స్వామినాథన్, గోగులపాటి సీతారామస్వామి, యిందన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరరావు, మంతెన సత్తిబాబు, మానేపల్లి రవీంద్ర, కేదారి నాగు, గొందేసి సత్యానందం, వెన్నా పండు, నూకలమంతి నానాజీ, సమ్మెట గంగాధర్ తదితరులున్నారు.

ఇరు వర్గాల మధ్య వివాదం

ఒకనిపై కత్తితో దాడి


కత్తిపోటుకు గురైన ఉపసర్పంచ్ కందా వెంకటరాజు అలియాస్ చినబాబు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో ఇరు వర్గాల మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో ఒక వర్గం దాడిలో మరో వర్గంలోని తండ్రీ కొడుకులకు కత్తి గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సర్పంచ్, ఉప సర్పంచ్ వర్గాల మధ్య కొంత కాలంగా వివాదం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి జాతీయ రహదారిలో వన్నెపూడి సెంటర్ వద్ద ఆ వర్గాల మధ్య ఘర్షణ తలెత్తడంతో సర్పంచ్ వర్గానికి చెందిన కందా చక్రధరరావు కత్తితో దాడి చేయడంతో ఉపసర్పంచ్ కందా వెంకటరాజు అలియాస్ చినబాబు, అతని కొడుకు కందా శ్రీరామమూర్తికి గాయాలయ్యాయి. వారిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఎస్సై వినయ్ ప్రతాప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో సకురు విష్ణుమూర్తి (55) మృతి చెందగా వాసంశెట్టి సత్యనారాయణకు గాయాలయ్యాయి. చెందుర్తి సెంటర్ వద్ద మోటారు సైకిల్‌పై వెళ్తున్న వారిద్దరినీ ఐషర్ వ్యాన్ ఢీకొట్టడంతో శంఖవరం మండలం పాత వజ్రకూటానికి చెందిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలైనట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముగిసిన కావమ్మ తిరునాళ్లు


కావమ్మ, మారెయ్యలను దర్శించుకున్న భక్తులు


కావమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గేమ్స్‌లో పిల్లల సందడి

సామర్లకోట: స్థానిక రజకపేటలో ఏలేరు కాలువ ఆవలి వైపు ఉన్న కావమ్మ ఆలయం వద్ద సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించిన తిరునాళ్లు మంగళవారం ముక్కనుమతో ముగిశాయి. పట్టణ పరిధిలోని అనేక గ్రామాల రైతులు, వ్యవసాయకూలీల కుటుంబాల వారు కావమ్మ, మారెయ్యలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలను ఆకర్షించడానికి వివిధ రకాల గేమ్స్ ఏర్పాటు చేశారు. ఆలయం సమీపం నుంచి పీబీసీ కెనాల్ వెళ్లడంతో దానిలో ఎయిర్ బాల్స్ ఏర్పాటు చేసి పిల్లలు ఆడుకునేలా చేశారు. ఏటా ఆలయం వద్ద నంబరు గుండాట ఏర్పాటు చేసే వారు. గుండాట ఏర్పాటు చేయడానికి వీల్లేదని పోలీసులు హెచ్చరికలు జారీ చేయడంతో ప్రశాంతంగా తిరునాళ్లు జరిగాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఈనెల 22న అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు సుకపట్ల నాగేశ్వర రావు, ఆదినారాయణ తెలిపారు.

ఏటీఎంలలో మోసాలకు పాల్పడుతున్న ముఠా గుట్టురట్టు

- ముగ్గురి అరెస్టు..
- రూ 1.40 లక్షలు.. ఏటీఎం కార్డుల స్వాధీనం

పిఠాపురం: ఏటీఎం సెంటర్లలో మోసాలకు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టు చేసిన పిఠాపురం పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,40,200, మోటారు సైకిల్, పాత ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కథనం ప్రకారం ఏటీఎం సెంటర్లలో వృద్ధులను మోసం చేసి ఏటీఎం కార్డులు మార్చి వేరే కార్డులు ఇచ్చి తరువాత డబ్బులు డ్రా చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా ఏటీఎం సెంటర్లలో సీసీ ఫుటేజీలను పరిశీలించగా నిందితుల ఆచూకీ లభించింది. దీంతో వారిని పట్టుకుని విచారించగా అసలు విషయాలు బయట పడ్డాయి. గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన కడారి నాగరాజు పిఠాపురం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి దగ్గర ఉన్న ఏటీఎం సెంటర్లో డబ్బులు తీసుకోడానికి ప్రయత్నించగా డబ్బు తీయడం తెలియలేదు. ఇంతలో అక్కడే ఉన్న ఒక అజ్ఞాత వ్యక్తి నేను తీస్తాను అంటూ ఏటీఎం కార్డు తీసుకుని కార్డు తిరిగి ఇచ్చే సమయంలో మోసం చేసి వేరే కార్డు ఇచ్చాడు. నాగరాజు వెళ్లి పోయాకా ఆ కార్డుతో రూ.28 వేలు డ్రా చేశాడు. మడబోయిన సుబ్బారావు అనే వ్యక్తిని ఇలాగే మోసం చేసి అతనికి రూ.14 వేలు డ్రాచేసి ఇచ్చి తరువాత రూ.1.05 లక్షలు కాజేసారు. అమలదాసు అప్పారావు అనే వ్యక్తిని ఇలాగే మోసం చేసి రూ.56 వేలు, శాంత కుమారి అనే మహిళను మోసం చేసి రూ 17,500, చిత్రాడ ఏటీఎం వద్ద మరో వృద్ధుడిని మోసం చేసి రూ.5000 కాజేసారు. దీంతో మోస పోయిన వారు పోలీసులను ఆశ్రయించగా పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ప్రత్తిపాడు మండలం పెద్దిపాలేనికి చెందిన బాబ్జీ, జగ్గంపేట మండలం ఇర్రిపాకకు చెందిన జి.దుర్గాప్రసాద్, శ్రీనివాస్ అలియాస్ మణికంఠ అనే నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.40 లక్షలు, మోటారు సైకిల్, పాత ఏటీఎం కార్డులు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చగా నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

కాకినాడలో హీరో కిరణ్ అబ్బవరం


మాట్లాడుతున్న హీరో కిరణ్ అబ్బవరం

కాకినాడ కల్చరల్: ప్రముఖ హీరో కిరణ్ అబ్బవరం 'వినరో భాగ్యం విష్ణు కథ' సినిమా ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం స్థానిక బాను గుడి సెంటర్‌లోని పద్మప్రియ కాంప్లెక్స్‌ను సందర్శించారు. మార్నింగ్ షో విరామ సమయంలో ప్రేక్షకుల నుద్దేశించి ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రేక్షకులు ఆదరించే చిత్రం 'వినరో భాగ్యం విష్ణు కథ' అని అన్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో తన చిత్రాలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. చిత్రం యువ తకు, వారి తల్లిదండ్రులకు మంచి సందేశం ఇస్తుందన్నారు. తోటి వారితో ఏవిధంగా మెలగాలనే కాన్సెప్ట్‌పై ఈ చిత్ర నిర్మాణం సాగుతోందన్నారు. ఫిబ్రవరి 17న విడుదల కానున్న ఈ చిత్రాన్ని ఆదరించాలనీ హీరో కిరణ్ కోరారు. ఈ కార్యక్రమంలో అబ్బు, చిన్ని, భాస్కర్ తదితరుల పాల్గొన్నారు.



సందర్శకులతో కిక్కిరిసిపోయిన బీచ్

కాకినాడ రూరల్: కాకినాడ బీచ్ జనసంద్రమైంది. సూర్యారావుపేట వద్ద ఎన్టీఆర్ బీచ్‌కు వేలాదిగా సందర్శకులు తరలివచ్చారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి సొంత ఊర్లకు వచ్చిన వారందరూ బీచ్‌లో సరదాగా గడిపేందుకు తరలిరావడంతో కిక్కిరిసింది. లైట్‌హౌస్ నుంచి నేమాం వరకు సందర్శకులతో నిండిపోయింది. మధ్యాహ్నం నుంచి బీచ్‌రోడ్డులో రద్దీ నెలకొనగా కాకినాడ రూరల్, ట్రాఫిక్, మెరైన్ పోలీసులు సందర్శకులకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సాయంత్రం తిరుగు ప్రయాణ సమయంలో బీచ్‌రోడ్‌లో వాహనాల రద్దీతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో గంటకు పైగా సందర్శకులు ట్రాఫిక్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. రూరల్ సీఐ శ్రీనివాస్, తిమ్మాపురం ఎస్సై నాగార్జునరాజు, ట్రాఫిక్ సీఐ చైతన్య కృష్ణ తదితరులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేశారు.